WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి   సంపుటి : 12   సంచిక : 360   శుక్రవారం 15-5-2026   పేజీలు : 4   వెల : 5-00




## నీట్-యూజీ2026 రద్దు...
## మోడీ సర్కార్ ఫెయిల్

- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్,**నవతరం**
: నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## సాయి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్

- బాధితురాలి రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది నిజం?
- వాదనలన్నీ విన్నాకే ముందస్తు బెయిల్‌పై నిర్ణయం
- విచారణ వచ్చే వారానికి వాయిదా వేసిన హైకోర్టు
- భగీరథ్ కోసం కొనసాగుతున్న పోలీసు గాలింపు
- బాధిత బాలిక ఫొటోలు, వీడియోలు వైరల్ చేస్తున్న వారిపై పోక్సో కేసు!





హైదరాబాద్, హైదరాబాద్**నవతరం**
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)పై శుక్రవారం ఉత్తర్వులు వెలువరిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

- మిగతా 2లో

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

జాబితాలో ఉభయ
తెలుగు రాష్ట్రాలు
కేంద్ర ఎన్నికల
సంఘం ప్రకటన




## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

- తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు
- మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి
- వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు
- హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు






హైదరాబాద్,నవతరం
మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి

- మిగతా 2లో




## కేరళ సిఎంగా విడి సతీశన్

- ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్
- పదరోజుల కసరత్తు అనంతరం ప్రకటన

తిరువనంతపురం,నవతరం
కేరళ సీఎం పోస్టుపై ఉత్కంఠ వీడింది. ఆ రాష్ట్రానికి తదుపరి సీఎంగా వీడీ సతీశన్ ను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ పదవి కోసం కె.సి.వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరకు సతీశన్‌నే ముఖ్యమంత్రి పదవి వరించింది. గత నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో పోటీపడిన ఈ కూటమి 102 చోట్ల విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉండటంతో సతీశన్ ఎంపికకు అధిష్ఠానం పది రోజుల సమయం తీసుకోవడం గమనార్హం.

మిగతా 2లో


## మరోమారు తెరపైకి ఫార్ములా కేసె

- ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు
- ఏసీబీ కోర్టు సమన్లు జారీ
- విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగం
- జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు




2లో

## పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు



కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు
సుబోధ్ గ్యాంగ్ పనిగా గుర్తించి అరెస్ట్
మీడియా ముందుకు ముగ్గురు దోపిడీ దొంగలు
రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ

2లో




2లో

## పదేపదే విమర్శలు తగని పని

అభివృద్ధి కోసం కష్టపడితే అడ్డుకోవడం సరికాదు
వైసిపి నేత బైరెడ్డి తీరుపై మండిపడ్డ మంత్రి టిజి భరత్

# నీట్-యూజీ2026 రద్దు...
# మోడీ సర్కార్ ఫెయిల్

(మొదటి పేజి (తరువాయి)

ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని...వారి ఆశలన్నీగల్లం తవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు.





నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## పదేపదే విమర్శలు తగని పని

కర్నూలు,మే14 అదే పనిగా విమర్శలు యచేయడం మానుకోవాలని వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై ఏపీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు వేదికగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూల్‌లో తమ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి సునీల్‌పై హత్యాయత్నం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు బాలు అనే వైసీపీ వ్యక్తిని విచారించారని అన్నారు. దీంతో ఈ అంశాన్ని డ్రామా రూపంలో బైరెడ్డి తెరపైకి తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. ఆయనకు మైండ్ లేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఒక జోకర్ అని జగన్‌కు కూడా తెలుసునని ఎద్దేవా చేశారు. తనపై లేని పోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఇంతవరకూ తమపై బైరెడ్డిలాగా ఆరోపణలు చేసిన వారు ఎవరు లేరని అన్నారు. ఈ విషయంలో తాను బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఏపీకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, తాను ఎంతో కష్టపడుతు న్నామని వ్యాఖ్యానించారు. సీబీఎన్ బ్రాండ్ మూలంగానే తాము వీటిని సాధించగలుగుతు న్నామని ఉద్ఘాటించారు. తమ మైండ్‌ను డైవర్ట్ చేయడానికి కర్నూలుకు బైరెడ్డి అనే ఓ జోకర్ వచ్చారని ఎద్దేవా చేశారు. ఆయన ఇక్కడకు వచ్చి పిట్టకథలు చెబుతున్నారని సెటైర్లు గుప్పించారు. బైరెడ్డి కర్నూలుకు వచ్చి తనపై లేని పోని ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు.

## కేరళ సిఎంగా విడి సతీశన్




కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. మంచి వక్తగానూ గుర్తింపు వచ్చింది. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. పాలనాపరంగా ఎలాంటి అనుభవం లేని సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయంపై అప్పట్లో పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ ఎల్‌డీఎఫ్‌ను ఎదుర్కొనే నేతగా తనను తాను నిరూపించుకున్నారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరాజయాలతో సతమతమవుతుంటే.. రాష్ట్రంలో మాత్రం హస్తం పార్టీ శ్రేణుల్లో ఆయన ఉత్సాహం నింపారని రాజకీయ విమర్శకులే అంగీకరించిన సందర్భాలున్నాయి.

## పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

కరీంనగర్,మే14: కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు. గురువారం కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు. ముగ్గురు నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు చూపించారు. నిందితులను 12 రోజుల పాటు దోపిడీ దొంగల కేసులో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు.

## మరోమారు తెరపైకి ఫార్ములా కేసె




హైదరాబాద్,మే14 తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది.

ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం.

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ




న్యూఢిల్లీ,మే14 దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది.

మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

## సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం



శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది.

## సాయి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్



అయితే, బాధితురాలికి సంబంధించిన రెండు బర్త్ సర్టిఫికెట్లలో ఏది వాస్తవమో తేల్చాలని సూచించింది. ప్రధాన పిటిషన్ అయిన ముందస్తు బెయిల్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. తనపై పేట్‌బషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, ఒకవేళ అరెస్టు చేసినా వెంటనే బెయిల్‌పై విడుదల చేసేలా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, ఈ కేసులో సత్వర విచారణపై బాధితురాలి తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయగా.. బాధితురాలి తరఫు వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల తీరుపై ధర్మాసనం కొంత అసహనం వ్యక్తం చేసింది. భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. విచారణకు హాజరుకావడానికి, సాక్ష్యాలను సమర్పించడానికి భగీరథ్ సిద్ధంగా ఉన్నారని, తాము కేసును కొట్టేయమని కోరడం లేదని, అరెస్టు నుంచి రక్షణ మాత్రమే కోరుతున్నామని తెలిపారు. సుప్రీం కోర్టు గత తీర్పుల ప్రకారం ఈ కేసులో భగీరథ్ బెయిల్‌కు అర్హుడని, ప్రస్తుతానికి మధ్యంతర ఉపశమన ఉత్తర్వులివ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 'బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ముందుగా కేసు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేసిన తర్వాత సెక్షన్లు మార్పు చేశారు' అని చెప్పారు. బాధితురాలి తరఫున న్యాయవాది పప్పు నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. నిందితుడు పరారీలో ఉంటూ ముందస్తు బెయిల్ కోరడం విడ్డూరంగా ఉందని, అంతేకాక అంత అత్యవసరం బెయిల్ కోరడం సరికాదన్నారు.

మధ్యంతర ఉపశమన ఉత్తర్వులిస్తే ముందస్తు బెయిల్ ఇచ్చినట్లేనని తెలిపారు. నిందితుడికి బెయిల్ వస్తే బాధితురాలు, ఆమె కుటుంబాన్ని వేధింపులకు గురి చేసే అవకాశం ఉందన్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కోర్టుకు సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ముందస్తు బెయిల్ మధ్యంతర అప్లికేషన్‌పై వాదనలు విని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ప్రధాన పిటిషన్‌లో విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. కాగా, మధ్యంతర రక్షణపై తీర్పును న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. దీంతో ఇప్పటికే పోలీసులు ఇచ్చిన నోటీసులకు విచారణకు తప్పక హాజరుకావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో బండి భగీరథ్ శుక్రవారం పోలీసు విచారణకు వస్తాడా? లేదా కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగుతాడా ? అనేది చూడాలి.

# అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమీలాల్లో వర్షాలు

**16 నాటికి అండమాన్‌లోకి నైరుతి ప్రవేశం**




విశాఖపట్నం,మే14 నైరుతి బంగాళాఖాతం– పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందన్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 16నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని పేర్కొన్నది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఈనెల 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడని హెచ్చరించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది.

వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉంటా యని 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించింది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ వారంపాటు జాగ్రత్తగా ఉండాలని కోరిం

## భద్రాద్రిని దర్శంచుకున్న తుమ్మల


**ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ**




భద్రాద్రి కొత్తగూడెం,మే14 : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు

# నోటి మాటతో 'మట్టి' మాయాజాలం - పార్ట్ 2

- రెవెన్యూ ముద్రల వెనుక ఏఈ 'మాస్టర్ ప్లాన్'.. ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్‌లో బట్టబయలైన బాగోతం
- మే 10తో గడువు ఖతం.. మే 12న 'రిసీవ్డ్' ముద్రలతో కొత్త నాటకం
- నవతరం విలేకరి పసిగట్టిన 'సీల్' రహస్యం,అధికారుల దాగుడుమూతలు అడ్డంగా బుక్
- ఒక జెసిబీకి పర్మిషన్.. వేరే నంబర్లతో మూడు జెసిబీల అక్రమ తవ్వకం
- ఏఈ 'బ్యాక్ డేట్' తెలివితేటలు చట్టం ముందు పని చేస్తాయా?
- అనుమతి ఉన్న జెసిబి ఇంట్లో,అక్రమ జెసిబి లు చెరువులో
- పేద రైతుకు మట్టి సున్నా,హైవే లే అవుట్లకు మాత్రం 100ల ట్రిప్పుల ఖజానా
- నిబంధన నెంబర్ 6 ప్రకారం ఇప్పటివరకు ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు?



నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: దమ్మపేట మండలం మందలపల్లి నల్లగుళ్ళవారి కుంటలో జరుగుతున్న మట్టి దోపిడీ వ్యవహారం ఇప్పుడు సెకండ్ పార్ట్ సినిమాను తలపిస్తోంది. ఇరిగేషన్ ఏఈ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి ఆడుతున్న 'ముద్రల నాటకాన్ని' 'నవతరం' ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ ఆధారాలతో సహా బట్టబయలు చేశారు. రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని తప్పును ఒప్పని నిరూపించేందుకు చేసిన ప్రయత్నం వికటించి, ఏఈ అసలు రంగు బయటపడింది.

తేదీల గారడీ, 12వ తేదీ ముద్ర వెనుక మర్మమేమిటి?

అక్రమ తవ్వకాలను ప్రశ్నించినప్పుడు ఏఈ ఒక వింత వాదన తెరపైకి తెచ్చారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఆ భూమిని సర్టిఫై చేసిందని, అందుకే తోలకాలకు అనుమతి ఇచ్చామని బుకాయించారు. అయితే, 'నవతరం' లోతైన పరిశీలనలో ఒక సంచలన విషయం వెలుగు చూసింది. అనుమతి పత్రం గడువు మే 10తో ముగిసిపోగా, రెవెన్యూ కార్యాలయం ఆ లెటర్‌ను రిసీవ్ చేసుకున్నట్లు ఉన్న ముద్ర మీద తేదీ మాత్రం మే 12 అని స్పష్టంగా కనిపిస్తోంది.

అంటే, మే 12న ఎవరైనా తనిఖీకి వస్తే, "చూడండి.. ఇవాళ కూడా మాకు అనుమతి ఉంది" అని నమ్మించడానికి, రెవెన్యూ అధికారులతో కలిపి ఆ రోజే ముద్ర వేయించుకున్నట్లు స్పష్టమవుతోంది. గడువు ముగిసిన తర్వాత పత్రాలపై ముద్రలు వేయించుకుని అక్రమాలను సక్రమం చేయాలనుకోవడం ఏఈ బరితెగింపునకు నిదర్శనం.

జెసిబీ నంబర్ల మాయాజాలం: పర్మిషన్ ఒకరికి.. పని మరొకరికి


అక్రమాలు అక్కడితో ఆగలేదు. అనుమతి పత్రంలో పేర్కొన్న జెసిబీ నంబర్ (టూ 28 క్యూ 6320) కు, క్షేత్రస్థాయిలో గునపాలు దించుతున్న యంత్రాలకు అస్సలు సంబంధం లేదు. పత్రంలో ఒక నంబర్ ఉంటే, అక్కడ వేరే నంబర్లు గల మూడు జెసిబీలు చెరువును తవ్వేస్తున్నాయి. "అక్కడ ఒకటే జెసిబీ ఉంది" అని ఏఈ అబద్ధాలు చెబుతున్నా, వేర్వేరు నంబర్లతో ఉన్న మూడు యంత్రాల ఫోటోలు, వీడియోలు ఏఈ పచ్చి అబద్ధాలను సాక్ష్యాలతో సహా నిలదీస్తున్నాయి.

రియల్ ఎస్టేట్ మాఫియాకు 'ఏఈ' రెడ్ కార్పెట్ వేస్తున్నారని పిస్తోంది.

రైతుల పొలాలకు వెళ్లాల్సిన మట్టి, నేషనల్ హైవే పక్కన వెలుస్తున్న కమర్షియల్ లేఅవుట్లకు తరలిపోతుంటే, అది నిరూపించాల్సిన బాధ్యత తనది కాదన్నట్లుగా ఏఈ వ్యవహరించడం దారుణం. నిబంధన నంబర్ 8 ప్రకారం మట్టి ఎక్కడ పడుతుందో పర్యవేక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, సామాన్య ప్రజలను బురిడీ కొట్టించేందుకు రెవెన్యూ ముద్రల నాటకానికి తెరలేపారు. ఉన్నతాధికారులారా.. కళ్లు తెరవండి.

లిఖితపూర్వక అనుమతి లేకుండా, గడువు ముగిసిన తర్వాత 'బ్యాక్ డేట్' ముద్రలతో కథ నడుపుతున్న దమ్మపేట ఏఈ పై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. నిబంధన నంబర్ 6 ప్రకారం ఈ అక్రమ తవ్వకాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నవతరం విలేకరి వెలికితీసిన ఈ 'ముద్రల కుంభకోణం'పై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం.



GOVERNMENT OF TELANGANA
IRRIGATION & CAD DEPARTMENT

From
Sri L.Krishna, M.Tech.,
Deputy Executive Engineer,
Irrigation Sub Division No.4,
Mandalapally.

To
Sri A.Narasimha Rao,
H.No.4-44, Mandalapally (V),
Dammapeta (M),
Bhadradri Kothagudem Dist.,
Mobil.No.9666418753

Lr.No.DEE/ISD No.4/Mdply/BC Soil/2026-27/147/M    Date: 05-05-2026.

Sir,

Sub:- ISD No.4 – Mandalapally – De-siltation and transportation of useful of Soils to farmers field from Nallagullavari Kunta, Mandalapally (V), Dammapeta (M) – Permission Accorded – Reg.

Ref:- 1. Instruction of Sri N.Uttam Kumar Reddy, Hon'ble Minister for Irrigation & Civil Supply, Telangana, through Video Conference Dated on 02-04-2026.
2. Instruction of the Chief Engineer, Irrigation, Kothagudem, through Video Conference Dated on 03-04-2026.
3. Application of Sri A.Narasimha Rao, Mandalapally (V), Dammapeta (M), Dated: 05-05-2026.

****

With reference to 1st & 2nd cited above, as per the instruction of the higher authorities, the farmer who is coming forward to take silt from the minor irrigation tanks shall be allowed to lift the silt from the tank bed area at their own cost.

Anent to the subject and reference 3rd cited above, Sri. A.Narasimha Rao, R/o Mandalapally (V), Dammapeta (M) has requested to lifting and transportation of useful soil from Nallagullavari Kunta, Mandalapally (V), to improve the nutritional ability of their field for the better yielding.


In this Connection, it is instructed to allow the above applicant for transportation of **1500 Cum (600 Tractors Trips)** of soil from Nalagullavari Kunta, Mandalapally (V), duly following the terms and conditions.

**Terms and Conditions:**

1. The soil is exclusively for the usage in the field Sy.No.615/3, (Ac 1.20 Gts), Sy.No.591/2, (Ac 1.185 Gts), Sy.No.592/2, (Ac 1.18 Gts) and Sy.No.311, (Ac 2.23 Gts) only.
2. The lifting and transportation of soil is allowed through the vehicle Numbers 1) JCB-TS28 Q 6320, 2) Tractor No. TG28 0223, 3) Tractor No. AP07 R 7238, 4) Tractor No. TS28 H 9594, 5) Tractor No. TS28 K 2631, 6) Tractor No. AP37 CU 8543, 7) Tractor No. TG28 D 2748, 8) Tractor No. TS28 L 5361, 9) Tractor No. AP20 TA 4944.
3. The Permission is valid from Dt **12.05.2026 to 17.05.2026** and the prescribed time **(06.00AM to 6.00PM)** only.
4. The Assistant Execu[...] Engineer is requested to ensure that, they should not damage any components [...] tank while taking the soil.
5. The Assistant Executive Eng[...]eer shall ensure that, No Soil should be taken from other patta lands or Forest [...]ds near by the location noticed by the concerned Authority.
6. The quantity is lifted more th[...] the permitted quantity, the department has no hesitation to book the criminal [...]se against the concerned.

// 1 //

12/5/2026
Received



// 2 //

7. Damaging / Decreasing of the capacity of the tank duly raising of lands in submergence area is not allowed, the department has no hesitation to book the criminal case against the concerned.
8. The Soil shall be lifted in the presence of concerned AEE only and they need to take care that the soil is not excavated below sill level of tank and should be excavated only up to FTL the tank so that live storage of tank increases.
9. If any incidents / accidents happened during lifting & transportation of soil, the applicant is held responsible.

It is also requested to adhere the above conditions scrupulously for lifting of the soil and report compliance.

Yours faithfully,

Deputy Executive Engineer,
Irrigation Sub Division No.4,
Mandalapally.

Recieved by

- నవతరం ఇన్వెస్టిగేషన్:'ముద్ర' పడింది.. అధికారి బాగోతం బయటపడింది
- పక్కా స్కెచ్.. పట్టుబడ్డ ఏఈ డ్రామా
- తేదీల మాయాజాలం: మే 10న అనుమతి ముగిస్తే.. మే 12న రెవెన్యూ ఆఫీసులో 'రిసీవ్డ్' ముద్ర వేయించుకోవడం వెనుక రహస్యమేంటి? తనిఖీకి వస్తే బుకాయించడానికే ఈ 'బ్యాక్ డేట్' ప్లానా?
- నంబర్ ప్లేట్ల గుట్టు: అనుమతి పత్రంలో ఉన్నది టూ 28క్యూ 6320.. కానీ క్షేత్రస్థాయిలో ఉన్నవి వేరే నంబర్ల గల 3 జెసిబీలు. అధికారి కళ్లు గప్పి ఈ నంబర్ల మార్పిడి జరుగుతోందా? లేక అధికారి కనుసన్నల్లోనే ఈ అక్రమ తవ్వకాలా?
- నోటి మాటే జీవో: ప్రభుత్వ నిబంధనల కంటే ఏఈ 'మౌఖిక' ఆదేశాలే పవర్ ఫుల్లా? సెలవుల పేరుతో గడువు పెంచే అధికారం ఏ జీవో ఇచ్చింది?
- రియల్ దందా: రైతు పొలంలో పడాల్సిన మట్టి.. హైవే పక్కన కమర్షియల్ వెంచర్‌లో ఎలా ప్రత్యక్షమైంది? నిబంధన 8 ప్రకారం పర్యవేక్షించాల్సిన అధికారి ఏ 'మామూళ్ల' మత్తులో ఉన్నారు?

# కురుప్ప విడుదలకు ముందే ఇబ్బందులు

**చివరి నిముషంలో షోలు రద్దు**




తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం కరుప్పు విడుదలకు ముందే అనూహ్య ఇబ్బందుల్లో చిక్కుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజి తెరకెక్కించిన ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ విడుదలకు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు సమాచారం. తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ్ ప్రభుత్వం ఉదయం 9 గంటల స్పెషల్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా ఒక్క షో పడకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. బుక్‌మైషోలో ఉదయం ఆటలకు సంబంధించిన బుకింగ్స్ కనిపించకపోవడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో కూడా పలు థియేటర్లలో మార్నింగ్ షోలు క్యాన్సిల్ అయ్యాయి. మ్యాట్నీ షోల బుకింగ్స్ కూడా రద్దు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అమెరికాలో ప్రీమియర్ షోలు నిలిపివేయడంతో పాటు, వీకెండ్ బుకింగ్స్‌పై కూడా అనిశ్చితి నెలకొంది. దీంతో సినిమా రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాలపై నిర్మాత ఎస్ఆర్ ప్రభు సోషల్ మీడియాలో స్పందించారు. 'అనివార్య కారణాల వల్ల ఉదయం 9 గంటల ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి.

# బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా




**మైసా కోసం ర ష్మిక ప్రత్యేక ట్రైనింగ్**

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.



# విరోష్ జోడీ..

## యాడ్‌కు విశేష స్పందన



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. అభిమానులు ప్రేమగా 'విరోష్' అని పిలుచుకునే ఈ జంట తాజాగా కలిసి చేసిన ఎయిర్‌బీఎన్‌బీ కపుల్ యాడ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డు స్థాయిలో స్పందన అందుకుంటోంది. ఈ యాడ్ పోస్టుకు ఇప్పటికే 9.1 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక లైక్స్ సాధించిన యాడ్ పోస్టుల్లో ఇది రెండో స్థానంలో నిలిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మొదటి స్థానంలో కూడా విజయ్-రష్మిక జంటే ఉండటం అభిమానులను మరింత ఆనందం కలిగిస్తుంది. గతంలో ఈ జంట కలిసి చేసిన మాన్యవార్ వెడ్డింగ్ క్యాంపెయిన్ యాడ్ సోషల్ మీడియాలో భారీ రికార్డులు సృష్టించింది. ఆ యాడ్ పోస్టుకు 11.5 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో పాటు 100 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కాయి. అప్పట్లో అది సోషల్ మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో కలిసి చేసిన లూయిస్ విట్టన్ యాడ్ పోస్టులతో పోలిస్తే.. విజయ్-రష్మిక యాడ్స్‌కు ఎక్కువ రెస్పాన్స్ రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థాయి స్పందన రావడానికి ప్రధాన కారణం వీరిద్దరికీ ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మిక మందన్నతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు.

# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

**ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళు న్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి.

# జూనియర్ ఎన్టీఆర్ గిఫ్ట్ లాంటివాడు..



తెలుగు యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ మనందరికీ ఓ గిఫ్ట్ లాంటి వాడని, అతని స్క్రీన్ ప్రజెన్స్ అద్భుతంగా ఉంటుందన్నాడు. ఓ ఇంటర్వ్యూలో రాహుల్ దేవ్ మాట్లాడుతూ.. తారక్ ఎక్స్‌ప్రెషన్స్, సహజత్వం అద్భుతమైన కామిక్ టైమింగ్, ఎనర్జీ ఉన్న బాలీవుడ్ యాక్టర్ గోవిందాను గుర్తుకు తెస్తుంది. చాలా మంది సమకాలీన యాక్టర్లలో అరుదైన జీనియస్ లెవల్ టాలెంట్ జూనియర్ ఎన్టీఆర్ సొంతమని ప్రశంసించాడు. రాహుల్ దేవ్ కామెంట్స్ చదివిన తారక్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆర్ఆర్ఆర్ స్టార్‌పై రాహుల్‌దేవ్ కామెంట్స్‌కు స్వాగతం పలికిన అభిమానులు నెట్టింట తెగ వైరల్ చేస్తున్నారు. పాన్ ఇండియా పాపులారిటీని ఎంజాయ్ చేస్తూనే బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు తారక్.తెలుగులో చివరగా జాక్ సినిమాలో నటించిన రాహుల్ దేవ్ ప్రస్తుతం రెండు హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాడు.

# కేడీ ట్రైలర్ విడుదల



ధ్రువ్ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కేడీ: ది డెవిల్' మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ దత్ కీలకపాత్రలో నటించారు. తాజాగా దీని తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇది అంతం కాదు.. ఆరంభం' అని ధ్రువ్ తన డైలాగులతో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ పాట పలు వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. దాన్ని అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ తొలగించారు. దీంతో తెలుగులో ఆ పాటను ఉంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com